ప్రజాశక్తి
గురువారం 14 మార్చి 2024
5
విజయనగరం



సివిల్ ఇంజినీరింగ్ ఆధ్వర్యంలో జాతీయ సెమినార్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జెఎన్‌టియులో సివిల్ ఇంజినీరింగ్ విభాగం అధ్వర్యంలో రెండు రోజులు పాటు జరగనున్న జాతీయ సెమినార్ బుధవారం యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ కె.వెంకటసుబ్బయ్య ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సివిల్ ఇంజినీరింగ్‌ను రాయల్ సివిల్‌గా ఆయన వర్ణించారు. సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉందన్నారు. లేటెస్ట్ టెక్నాలజీని అందిపుచ్చుకొని అనుకున్నలక్ష్యాలను సాధించుకోవాలన్నారు. అనంతరం సివిల్ ఇంజినీరింగ్ ప్రాధాన్యత, ఉపయోగాల గురించి అధ్యాపకులు వివరించారు. సెమినార్‌లో వివిధ కళాశాలల విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

కురుపాం నియోజకవర్గం

సిపిఎం అభ్యర్థిగా మండంగి రమణ?



ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

రానున్న సాధారణ ఎన్నికల్లో కురుపాం నియోజకవర్గం నుంచి సిపిఎం అభ్యర్థిగా ఆ పార్టీ సీనియర్ నాయకులు, చెముడు గూడ ఎంపిటిసి సభ్యుడు మండంగి రమణ బరిలోకి దిగనున్నట్లు తెలిసింది. పార్టీ అధిష్టానం రెండు మూడురోజుల్లో రమణను అభ్యర్థిగా ప్రకటించే అవకాశం ఉందని తెలిసింది. ఇప్పటికే వైసిపి అభ్యర్థిగా ప్రస్తుత ఎమ్మెల్యే పుష్ప శ్రీవాణి, టిడిపి జనసేన ఉమ్మడి కూటమి అభ్యర్థిగా తోయక జగదీశ్వరిని ఆయా పార్టీలు ప్రకటించిన విషయం తెలిసిందే. మరో వైపు సిపిఎం బలపరుస్తున్న అభ్యర్థిగా మండంగి రమణ పేరు వినిపిస్తోంది. ఈ మూడు పార్టీల అభ్యర్థుల మధ్య పోటీ రసవత్తరంగా ఉండబోతుందని రాజకీయ పరిశీలకులు అంటున్నారు.

1994 నుంచి రాజకీయ ప్రస్థానం..

మండంగి రమణ 1994లో మొదటిసారిగా సిపిఎం పార్టీలో చేరారు. అప్పటి సిపిఎం నాయకులు కీర్తిశేషులు పత్తిక హరిచంద్రుడు గిరిజనుల పక్షాన చేస్తున్న ఉద్యమాలు , పోరాటాలకు రమణ ఆకర్షితుడై సిపిఎంలో చేరారు. హరిశ్చంద్రుడు సేవా కార్యక్రమాల స్ఫూర్తితో సిపిఎం పార్టీలో చేరి పార్టీ అభివృద్ధికి కృషి చేశారు. మంచి మనిషిగా, ప్రజా సేవకుడుగా మన్య ప్రాంతంలో రమణ గుర్తింపు తెచ్చుకున్నారు. గిరిజనులకు కష్టమొస్తే పగలైనా రాత్రయినా అండగా ఉంటూ వారి సమస్యలను పరిష్కరించడంలో ముందుంటారు. గిరిజనుల హక్కులు, చట్టాలు, పోడు పట్టాలు, గిరిజన యువతకు ఉద్యోగ ఉపాధి కల్పన, గ్రామంలో తాగునీరు, రోడ్లు, వైద్యం వంటి మౌలిక వసతుల కల్పన కోసం సిపిఎం, గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఎన్నో పోరాటాలు, ఉద్యమాలు చేసి పరిష్కారానికి కృషి చేశారు. గిరిజనులు పండించే అటవీ ఫల సాయాలకు గిట్టుబాటు ధర కల్పించాలని ఎన్నోసార్లు జిసిసి, ఐటిడిఎ కార్యాలయం ఎదుట గిరిజనులతో కలిసి పోరాటాలు చేసి వారికి మద్దతుగా నిలిచారు.

సర్పంచి, ఎంపిటిసిగా కొనసాగుతూ...

గిరిజనులు, దళితులు, బిసిలు, ఉద్యోగులు, వ్యాపారుల సహకారంతో మండంగి రమణ రెండుసార్లు సర్పంచ్‌గా, మరో రెండు సార్లు ఎంపిటిసిగా గెలుపొందుతూ వస్తున్నారు. 2004లో మొదటిసారిగా ఎల్విన్ పేట పంచాయతీ సర్పంచ్ గా ఎన్నికయ్యారు. రెండోసారి 2009లో ఎంపిటిసిగా గెలుపొందారు. మళ్లీ 2014లో ఎల్విన్ పేట సర్పంచిగా విజయం సాధించారు. 2021లో జరిగిన ఎన్నికల్లో రిజర్వేషన్ మార్పులు కారణంగా చెముడు గూడ ఎంపిటిసిగా పోటీ చేసి గెలుపొందారు. రేషన్ కార్డులు, పింఛన్లు, గ్రామాల్లో బోర్లు, సిసి రోడ్లు, ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందేలా కృషి చేస్తూ ఉత్తమ ప్రజా ప్రతినిధిగా గిరిజన గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారు.

అభ్యర్థుల ప్రతీ ఖర్చును లెక్కిస్తాం

జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి

ప్రజాశక్తి-విజయనగరం

ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ప్రతి ఖర్చునూ లెక్కిస్తామని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి స్పష్టం చేశారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో బుధవారం తన ఛాంబర్ లో సమావేశం నిర్వహించారు. ఓట్ల జాబితా సవరణలో భాగంగా, ఈ వారంలో వచ్చిన దరఖాస్తులు, ఫిర్యాదులు, తొలగింపులు సంబంధించిన వివరాలను వెల్లడించారు. అభ్యర్థుల ఖర్చులకు సంబంధించి పాటించాల్సిన నియమ నిబంధనలను ఈ సందర్భంగా కలెక్టర్ వివరించారు. అభ్యర్థులు చేసే ప్రతి ఖర్చును లెక్కిస్తామని తెలిపారు. దీని కోసం ప్రత్యేక బృందాలను కూడా నియమించామని, వీడియో రికార్డింగ్ కూడా చేస్తామని తెలిపారు. ఖర్చులకు సంబంధించిన అంశాలను వివరించారు. యాంప్లిఫయర్లు, వాహనాలు, సమావేశ మందిరాలు, మైక్ సెట్లు, ఫ్లెక్సీలు, బ్యానర్లు, రాలీ నిర్వహణకు అయ్యే ఖర్చు తదితర వివరాలను వెల్లడించారు. మార్కెట్లో ఉన్న ధరల ఆధారంగానే వీటిని నిర్ణయించడం జరిగిందని, ఈ ధరలపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని రాజకీయ పార్టీలను కోరారు. కౌంటింగ్ సెంటర్ల ఏర్పాటుపై రాజకీయ పార్టీల అభిప్రాయాలను తెలుసుకున్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, అసిస్టెంట్ కలెక్టర్ వెంకట త్రివినాగ్, వ్యయ నోడల్ ఆఫీసర్ అరుణకుమారి, ఇఆర్‌ఒలు, తహశీల్దార్లు, డిప్యూటీ తాహశీల్దారులు, ఎన్నికల సూపరింటెండెంట్ ప్రభాకర్, సిబ్బంది, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.



జెఎన్‌టియులో కౌంటింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, జెసి తదితరులు

జెఎన్‌టియుజివిలో ఓట్ల లెక్కింపు కేంద్రాలు

జెఎన్‌టియు గురజాడ విశ్వ విద్యాలయంలో ఓట్ల లెక్కింపు కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు జిల్లా యంత్రాంగం ప్రతిపాదించింది. ఈ మేరకు విశ్వవిద్యాలయ భవనాలను కలెక్టర్ నాగలక్ష్మి బుధవారం పరిశీలించారు. అకడమిక్ బ్లాక్ 1, 2, గోస్తనీ బ్లాక్, ఇటీవలే కొత్తగా ప్రారంభించిన గర్ల్స్ హాస్టల్ భవనాలను, పరిసర ప్రాంతాలను పరిశీలించారు. స్ట్రాంగ్ రూములు, ఓట్ల లెక్కింపు కేంద్రాలు, రిసెప్షన్ సెంటర్ల ఏర్పాటుకు అనువైన గదులను, ప్రాంతాన్ని గుర్తించారు. రిసెప్షన్ కౌంటర్లు, పార్కింగ్ ఏర్పాట్లుపైనా జెఎన్‌టియుజివి ప్రిన్సిపాల్ శ్రీకుమార్, ఇతర అధికారులతో చర్చించారు. అందుబాటులో ఉన్న వసతులను బట్టి రెండు లేదా మూడు నియోజకవర్గాల ఓట్ల లెక్కింపును ఇక్కడ చేపట్టాలని భావిస్తున్నారు. కలెక్టర్‌తోపాటు జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, అసిస్టెంట్ కలెక్టర్ వెంకట త్రివినాగ్, ఆర్‌డిఒ ఎంవి సూర్యకళ, తాహశీల్దార్ ఎవి రత్నం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిఇఒ ప్రేమ్‌కుమార్

టెన్త్ పరీక్షలకు సర్వం సిద్ధం

129 కేంద్రాలు ఏర్పాటు • 23,828 మంది విద్యార్థులు హాజరు

జిల్లా విద్యా శాఖ అధికారి ప్రేమ్ కుమార్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈ నెల 18 తేదీ నుంచి 30 తేదీ వరకు జరగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా విద్యా శాఖ అధికారి ఎన్.ప్రేమ్ కుమార్ తెలిపారు. డిఇఒ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పదో తరగతి పరీక్షల ఏర్పాట్లు గురించి వివరించారు. జిల్లాలో 422 హైస్కూల్స్ నుంచి పరీక్ష రాసేందుకు 23,828 మంది విద్యార్థులు హాజరు కానున్నారని చెప్పారు. 129 కేంద్రాల్లో పరీక్షలు జరుగుతాయన్నారు. ప్రతి రోజు ఉదయం ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు. విద్యార్థులు పరీక్షకు సకాలంలో హాజరు కావాలన్నారు. కొన్ని కారణాలు రీత్యా ఆలస్యంగా వస్తే 10 గంటలు వరకు అనుమతించేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఒకే విద్యార్థి ప్రతి రోజూ ఆలస్యంగా వస్తే అనుమతించబోమని తెలిపారు.

విద్యుత్, వైద్య, రెవెన్యూ, పోలీస్‌శాఖల సహకారంతో పరీక్ష కేంద్రాల వద్ద ఎటువంటి ఇబ్బందులూ లేకుండా తాగునీరు,మరుగుదొడ్లు, విద్యుత్‌సౌకర్యం అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. విద్యార్థులు నేరుగా నెట్ ద్వారా హాల్ టికెట్ డౌన్ లోడ్ చేసుకోవచ్చునని తెలిపారు. హాల్ టికెట్‌పై హెచ్ ఎం సంతకం తప్పనిసరిగా ఉండాలన్నారు. ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలనూ అనుమతించడం లేదన్నారు. హాల్ టికెట్,పెన్ ప్రతి విద్యార్థి వెంట తెచ్చుకోవాలన్నారు. పరీక్ష నిర్వహణకు 1400 మంది ఇన్విజిలేటర్లను నియమించామన్నారు. వీరితో పాటు తనికీ బృందాలు, సిటింగ్ స్క్వాడ్, ఫ్లయింగ్ స్క్వాడ్‌లు ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకునే విధంగా సమయానికి ఆర్టీసి బస్సులు అందుబాటులో ఉంటాయని తెలిపారు. పదో తరగతి పరీక్షలకు సంబంధించిన సమాచారాన్ని తెలిపేందుకు తమ కార్యాలయంలో 9000945346 మొబైల్ నెంబరుతో హెల్ప్‌లైన్ ఏర్పాటు చేశామని, కార్యాలయ వేళల్లో ఫోన్ చేసి సమాచారం తెలుసుకోవచ్చన్నారు. సమావేశంలో ఎగ్జామ్ బోర్డు కన్వీనర్ సన్యాసిరాజు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షకు 1209 మంది గైర్హాజరు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఇంటర్ పరీక్షకు జిల్లా వ్యాప్తంగా బుధవారం 1209 మంది గైర్హాజరయ్యారు. మొత్తం 21,210 మంది హాజరు కావాల్సి ఉండగా వారిలో 20,001 మంది హాజరయ్యారని ఆర్ఐఒ ఎం.ఆదినారాయణ తెలిపారు.

పరీక్ష కేంద్రాలు పరిశీలన

విజయనగరం కోట : జిల్లాలోని చీపురుపల్లి, నెల్లిమర్ల, గుర్ల లోని ఇంటర్ పరీక్షా కేద్రాలను అదనపు ఎస్‌పి అస్మా ఫర్హీన్ స్వయంగా పర్యవేక్షించారు.ఎటువంటి అవకతవకలు, కాపీయింగ్ జరగకుండా ఏర్పాటు చేసిన బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు.



కమిషనర్‌కు వినతినిస్తున్న సిఐటియు నాయకులు జగన్మోహన్

జీతాలు ఇవ్వకుంటే బతికేదెలా?

పంపు హౌస్ కార్మికుల ఆవేదన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ముషిడిపల్లి, రామతీర్థాలు, నెల్లిమర్ల మాస్టర్ పంప్ హౌస్ కార్మికులకు 5నుంచి 8 నెలల జీతాలు బకాయిలు ఉన్నాయని, నెలలు తరబడి జీతాలు చెల్లించకపోతే కుటుంబాలతో ఎలా బతకాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) ఆధ్వర్యంలో బుధవారం కమిషనర్‌కు వినతినిచ్చారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎ.జగన్మోహన్‌రావు , నాయకులు మురళి, అరుణ్ మాట్లాడుతూ ఇంకెంతకాలం పస్తులతో బతకాలని ప్రశ్నించారు. అధికారులు, పాలకవర్గం, ప్రజాప్రతినిధులు చుట్టూ తిరుగుతున్నా జీతాలు చెల్లించడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి జోక్యం చేసుకొని తక్షణమే జీతాలు ఇప్పించాలని కోరారు. స్పందించకుంటే ఆందోళన చేయక తప్పదని హెచ్చరించారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో నారాయణరావు, సత్యనారాయణ ,రాంబాబు, రమేష్, శ్రీను, కృష్ణ ,గోవిందా, శివ ,స్వామి, బంగారు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వాడుక భాషకు వన్నె తెచ్చిన మొల్లమాంబ

జయంతి కార్యక్రమంలో ఎఎస్‌పి అస్మా ఫర్హీన్

ప్రజాశక్తి-విజయనగరం కోట

తన రచనలతో వాడుక భాషకు కవయిత్రి మొల్లమాంబ వన్నె తెచ్చారని అదనపు ఎస్‌పి అస్మా ఫర్హీన్ అన్నారు. మొల్లమాంబ జయంతిని పురస్కరించుకొని బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ 16వ శతాబ్ధానికి చెందిన ఆతుకూరి మొల్లమాంబ తెలుగు కవయిత్రిగా కీర్తి గడించారన్నారు. వాఙ్మయ మూలాలు ఆధారంగా కవయిత్రి స్వతంత్ర భావాలు కలిగిన వ్యక్తని, ఆమె సరళమైన వాడుక భాషలో సామాన్యులకు కూడా అర్థమయ్యే శైలిలో రచనలు చేసారని తెలిపారు. సంస్కృత భాషలోని రామాయణాన్ని ప్రప్రథమంగా తెలుగులోకి అనువదించిన మహిళగా మొల్లమాంబ ఘనత వహించారన్నారు. అటువంటి మహనీయురాలైన కవయిత్రి మొల్లమాంబను స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఎఆర్ డిఎస్‌పి యూనివర్స్, డిసిఆర్‌బి సిఐ జె.మురళి, రిజర్వు ఇన్‌స్పెక్టర్ టి.శ్రీనివాసరావు, డిపిఒ పర్యవేక్షకులు ప్రభాకరరావు, డిసిఆర్‌బి ఎస్ఐ గణేష్, డిటిఆర్‌బి ఎస్ఐ ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.



మొల్లమాంబ చిత్రపటం వద్ద సెల్యూట్ చేస్తున్న ఎఎస్‌పి అస్మా ఫర్హీన్

ఘనంగా మొల్లమాంబ జయంతి

విజయనగరం టౌన్ : కవయిత్రిమొల్లమాంబ జయంతి సందర్భంగా జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖాధికారి కె.సందీప్ కుమార్, ఉద్యోగుల సమక్షంలో కవయిత్రి మొల్లమాంబ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కుమ్మరి శాలివాహన సంఘం అధ్యక్షులు కోసూరి రమణ, ప్రధాన కార్యదర్శి కాకుళపు వెంకటమూర్తి,రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉబ్బిలి శెట్టి అప్పలస్వామి, తదితరులు పాల్గొన్నారు.

పిఎం సూరజ్ కింద రూ9.67 కోట్లు పంపిణీ

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లాలో పిఎం సూరజ్ పథకం కింద ఎస్‌సి, ఒబిసి, సఫారీ కర్మచారీ కార్మికులకు సంబంధించి 93 మంది లబ్దిదారులకు రూ.9.67 కోట్లను సహాయ కలెక్టర్ వెంకట త్రివినాగ్ చేతుల మీదుగా అందజేశారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఢిల్లీ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ ప్రత్యక్ష ప్రసారాన్ని కలెక్టరేట్ ఆడిటోరియంలో సహాయ కలెక్టర్ త్రివినాగ్ తో పాటు ఎస్‌సి కార్పొరేషన్ ఇడి సుధారాణి, బిసి కార్పొరేషన్ ఇడి పెంటోజీరావు, సోషల్ వెల్ఫేర్ డిడి రామానందం, ఎల్‌డిఎం శ్రీనివాస రావు, విజయనగరం, నెల్లిమర్ల మున్సిపల్ కమిషనర్లు మల్లయ్య నాయుడు , బాలాజీ ప్రసాద్, లబ్దిదారులు వీక్షించారు. అనంతరం లబ్దిదారులకు పలు పథకాల కింద రుణాలను , పారిశుధ్య కార్మికులకు ఆయుష్మాన్ హెల్త్ కార్డులను, సెప్టిక్ ట్యాంక్ కార్మికులకు పిపిఇ కిట్లను అందజేశారు.

నేడు మంత్రి బొత్స సత్యనారాయణ రాక

ప్రజాశక్తి-విజయనగరం

రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ గురువారం జిల్లాలో పర్యటించనున్నారు. పార్వతీపురం – మన్యం జిల్లా కిమ్మి, రుషింగిలో ఉదయం 10.30 గంటల నుంచి పలు కార్యక్రమాల్లో పాల్గొన్న అనంతరం వంగర మండలం తలగాం 12.10 గంటలకు చేరుకొని గ్రామ సచివాలయం, రైతుభరోసా కేంద్రం, వెల్ నెస్ కేంద్ర భవనాలను ప్రారంభిస్తారు. 12.30 గంటలకు అక్కడ నుండి బయలుదేరి 2 గంటలకు విశాఖపట్నం చేరుకొని అక్కడ ఏర్పాటైన కార్యక్రమాల్లో పాల్గొంటారు.



పెద్దచెరువు గట్టున వాకింగ్ ట్రాక్‌ను ప్రారంభిస్తున్న కోలగట్ల వీరభద్రస్వామి

వాకింగ్ ట్రాక్ ప్రారంభం

బోటు షికారు ఏర్పాటుకు చర్యలు : కోలగట్ల

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రానున్న రోజుల్లో పెద్ద చెరువును అభివద్ధి చేసి ప్రజలకు ఆహ్లాద, ఆరోగ్య కరంగా తీర్చిదిద్దుతామని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి అన్నారు. బుధవారం వెంకటలక్ష్మి జంక్షన్ వద్ద చెరువుగట్టు ప్రాంతాన్ని మహాత్మా గాంధీ వాకింగ్ ట్రాక్‌గా తీర్చిదిద్ది ప్రారంభించారు. అందరితో కలిసి కొద్దిసేపు నడక మార్గం గుండా నడిచారు. చుట్టుపక్కల మొక్కలు నాటి ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలని అక్కడున్న వారికి సూచించారు. ఈ సందర్భంగా కోలగట్ల మాట్లాడుతూ రానున్న రోజుల్లో పెద్ద చెరువు గట్టు ప్రాంతమంతా ప్రజా వినియోగంలోకి తీసుకురానున్నట్లు చెప్పారు.కిలోమీటర్ పైబడి ఏర్పాటు చేసిన వాకింగ్ ట్రాక్ పై పగలు, సాయంత్ర వేళలో ప్రజలు వాకింగ్ చేసుకునేందుకు అవకాశం ఉందని అన్నారు. ఇప్పటికే ఆచంట గార్డెన్‌ను అందంగా తీర్చిదిద్దుగలిగామని చెప్పారు. దోమల మందిరం ప్రాంతంలో హెల్త్ ఎరినాగా మార్చనున్నట్లు చెప్పారు. చెరువుకు నాలుగు వైపులా అభివద్ధి పనులు చేసేందుకు యోచిస్తున్నామన్నారు. బోటు షికారులు కూడా ఏర్పాటుచేసే యోచన ఉందన్నారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, గవర కార్పొరేషన్ డైరెక్టర్ ఆడారి రుక్మిణి, వైసిపి నాయకులు యడ్ల రాజేష్, బలివాడి కాశీపతిరావు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి ఇన్‌స్పైర్‌కు రెండు ప్రాజెక్టులు ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జాతీయ స్థాయి ఇన్‌స్పైర్ పోటీలకు జిల్లా నుంచి రెండు ప్రాజెక్టులు ఎంపికైనట్లు జిల్లా సైన్స్ అధికారి ఎం.కృష్ణారావు తెలిపారు.ఈనెల 11 నుంచి 13 వరకు చిత్తూరు జిల్లా పలమనేరులో రాష్ట్ర స్థాయి ఇన్‌స్పైర్ మనాక్ పోటీలు జరిగాయని తెలిపారు. రాష్ట్రం మొత్తం 306 ప్రాజెక్టులు ప్రదర్శించగా అందులో 24 ప్రాజెక్టులు జాతీయస్థాయికి ఎంపికయ్యాయని చెప్పారు. రేగిడి ఆమదాలవలస మండలం సంకిలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు రూపొందించిన బహుళార్థ సాధక అధునాతన సుత్తి, కొత్తవలస మండల కేంద్రం మహాత్మా జ్యోతిభా పూలే గురుకులం విద్యార్థి జి.పూజిత రూపొందించిన జీవ సంచులు అనే ప్రాజెక్టులు జాతీయ స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. చిత్తూరు జిల్లా విద్యాశాఖ అధికారి దేవరాజు చేతుల మీదుగా వీరు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందుకున్నారన్నారు. జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థులను, వారికి గైడ్ చేసిన ఉపాధ్యాయులను డిఇఒ ప్రేమకుమార్, జిల్లా సైన్స్ అధికారి కృష్ణారావు అభినందించారు.

15 నుంచి ఎల్లారమ్మ జాతర

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఈనెల 15,16,17తేదీల్లో నగరంలోని బాలాజీ జంక్షన్‌లోగల ఎల్లారమ్మ ఆలయం వద్ద జాతరను నిర్వహించనున్నట్లు ఎల్లమాంబ సేవా సంఘం అధ్యక్షులు వాలి, గౌరవ అధ్యక్షులు రామకోటేశ్వరరావు పూజారి చందక అప్పారావు తెలిపారు. బుధవారం ఎల్లారమ్మ గుడిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ 15న శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని, 16న తొలేళ్ల ఉత్సవం, 17న సిరిమాను ఉత్సవం నిర్వహిస్తామని తెలిపారు. ప్రజలంతా పాల్గొని జాతరను జయప్రదం చేయాలని కోరారు. ఏప్రిల్ 4న మహా అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అగ్రపు సన్యాసిరాజు, కృష్ణారావు, నూకారావు, ఆలయ కమిటీ సలహాదారు బంటుపల్లి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

పేదల పక్షపాతి జగన్

వైసిపి యువజన విభాగం అధ్యక్షుడు బైరెడ్డి

నగరంలో యువజన విభాగం ర్యాలీ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పేదలు పక్ష పాతి, ఇచ్చిన హామీలను అమలు చేసిన నాయకుడు సిఎం జగన్మోహన్‌రెడ్డి అని వైసిపి యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి అన్నారు. బుధవారం వైసిపి యువజన విభాగం ఆధ్వర్యంలో యువజన భేరి ర్యాలీ, సభను నిర్వహించారు. స్థానిక వెంకటలక్ష్మి జంక్షన్ నుంచి ప్రారంభమైన ర్యాలీ,మూడు లాంతర్లు వరకు జరిగింది. మూడు లాంతర్లు వద్ద జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ దొంగ హామీలు ఇచ్చి అధికారంలోకి రావాలని చంద్రబాబు చూస్తున్నాడని విమర్శించారు. వైసిపికి అనుకూలంగా మాట్లాడిందని ఒక అమాయకురాలైన మహిళను వేధించి చంపేశారన్నారు. జగన్మోహన్‌రెడ్డి కనుసైగ చేస్తే ఎవరిని ఎక్కడ పెట్టాలో అక్కడ పెడతామన్నారు. సంక్షేమ ,అభివృద్ధి ఎంత ముఖ్యమో శత్రువులను తొక్కడం కూడా అంతే అవసరం ఉందన్నారు. చంద్రబాబు, లోకేష్, పవన కళ్యాణ్ చేసిన తప్పులను ప్రశ్నిస్తున్నందునే జగన్ మంచోడు కాదని అంటున్నారని అన్నారు. మోడీని ఉగ్రవాది అని , భార్యను చూసుకోలేని వాడు దేశానికి ప్రధానిగా ఏమి చేస్తాడని తిట్టిన చంద్రబాబు నేడు బిజెపితో కలిశాడన్నారు. ఒక్క శాతం ఓట్లు లేని బిజెపి కి 6 ఎంపి సీట్లు, 6 శాతం ఓట్లు ఉన్న జనసేనకు 2 ఎంపి సీట్లు తీసుకున్నారంటే పవన కళ్యాణ్ పార్టీ పరిస్థితి గురించి తెలుసు కోవాలన్నారు. చంద్రబాబు చేసిన మోసాలు ప్రజలు మర్చిపోరని, వడ్డీతో సహా చెల్లించే రోజులు దగ్గరపడ్డాయని అన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం ఎమ్మెల్యేగా కోలగట్ల వీరభద్రస్వామిని, ఎంపిగా బెల్లాన చంద్రశేఖర్‌ను గెలిపించాలని కోరారు.కార్యక్రమంలో డిప్యూటి స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, ఎంపి బెల్లాన చంద్రశేఖర్, యువజన విభాగం నాయకులు కౌశిక్ తదితరులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి

టిక్కెట్ పై తప్పుడు ప్రచారాలు నమ్మొద్దు

టిడిపి అభ్యర్థి కొండపల్లి శ్రీనివాస్

ప్రజాశక్తి-గజపతినగరం

పార్టీ అభ్యర్థిత్వంపై వస్తున్న తప్పుడు ప్రచారాలు నమ్మవద్దని, తనకు పార్టీ నాయకులు, కార్యకర్తలు అండగా నిలవాలని టిడిపి, జనసేన, బిజెపి ఉమ్మడి అభ్యర్థి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. బుధవారం స్థానిక స్వాతీఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ఆ పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గత నెల 24న పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు స్వయంగా తనను అభ్యర్థిగా ప్రకటించారని, అయినా కొందరు టికెట్ మారుతుందని తప్పుడు ప్రచారాన్ని పార్టీ నాయకుల్లోకి తీసుకువెళ్తున్నారని అన్నారు. ఈ విధానం వల్ల పార్టీకి తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. ఇక నుంచైనా నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా ముందుకు రావాలని తద్వారా నియోజకవర్గంలో పార్టీని తిరుగులేని శక్తిగా తీర్చిదిద్దాలని కోరారు. కొండపల్లి పైడితల్లి నాయుడు మనవడిగా రాజకీయ అరంగేట్రం చేస్తున్నానని, మీ అందరి ఆశీర్వాదం తనపై ఉండాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపిలు కొండపల్లి కొండలరావు, గంట్యాడ శ్రీదేవి, సర్పంచ్లు రూమాన అరుణ్ కుమారి, లంక చిన్నంనాయుడు, దత్తిరాజేరు మండల పార్టీ అధ్యక్షులు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పూర్తి సమయం పార్టీకి కేటాయించాలి

నియోజకవర్గ సమావేశంలో అదితిగజపతి

ప్రజాశక్తి-విజయనగరం కోట

నియోజక వర్గ నాయకులు, కార్యకర్తలు పూర్తి సమయం పార్టీకి కేటాయించాలని టిడిపి, జనసేన ఉమ్మడి అభ్యర్థి పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు తెలిపారు. బుధవారం పార్టీ కార్యాలయం అశోక్ బంగ్లాలో విజయనగరం నియోజకవర్గ విస్తత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల నోటిఫికేషన్ త్వరలోనే వచ్చేస్తుందని అందుచేత మనందరం ఈ ఎన్నికల కాలంలో పూర్తి సమయం పార్టీకి కేటాయించాలని కోరారు. . వివిధ అనుబంధ కమిటీల సభ్యులంతా ప్రచారాన్ని ముమ్మరం చేయాలన్నారు. సోషల్ మీడియాలో కూడా పార్టీ శ్రేణులంతా యాక్టివ్ గా ఉండాలని, శంఖారావం – బాబు సూపర్ సిక్స్ కార్యక్రమాలపై ఇంటింటి ప్రచారం చేయాలన్నారు. సమావేశంలోనాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టిడిపి ఇంటింటి ప్రచారం

టిడిపి ఎస్‌సి సెల్ నాయకులు 11వ డివిజన్ కాటవీధి ప్రాంతంలో ఇంటింటి ప్రచారం చేశారు. టిడిపి ప్రభుత్వ హయాంలో దళితులకు అందించిన పథకాలను వివరిస్తూ, దళితులకు రక్షణ, ఆర్థిక, సామాజికాభివృద్ధి కల్పించాలంటే టిడిపి –జనసేన పార్టీలకు మద్దతుగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌సి సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మామిడి రవిశంకర్, నియోజకవర్గ అధ్యక్షులు గొండేల ప్రకాష్, కె.పైడిరాజు, దాన రాంబాబు పాల్గొన్నారు.

ఎంపి స్థానాన్ని తూర్పు కాపులకు కేటాయించాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

తూర్పు కాపులు అధికంగా ఉన్న విజయనగరం జిల్లాలో ఎంపి స్థానాన్ని రాజకీయ పార్టీలు తూర్పు కాపులకు కేటాయించాలని తూర్పుకాపుల సామాజిక వేదిక అధ్యక్షుడు రొంగలి రామారావు, ఉపాధ్యక్షులు అంబల్ల అప్పల నాయుడు, మజ్జి అప్పారావు డిమాండ్ చేశారు. తూర్పు కాపులు సామాజిక వేదిక భవనంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ వెనుకబడిన తూర్పుకాపులను ఎల్లప్పుడూ బడుగు జాతులగానే చూస్తున్నారే తప్ప పాలనాధికారాన్ని ఇచ్చేందుకు రాజకీయ పార్టీలు ముందుకు రావడంలేదని అన్నారు. జిల్లాలో తూర్పు కాపులు అధికంగా ఉన్నప్పటికీ విజయనగరం ఎంపీ స్థానాన్ని కొన్ని పార్టీలు తూర్పు కాపు సామాజిక వర్గానికి కేటాయించకుండా అన్యాయం చేస్తున్నాయని అన్నారు. న్యాయబద్ధంగా తూర్పుకాపులు అధిక సంఖ్యలో ఉన్న నియోజకవర్గాలను వారికే కేటాయించాలని కోరుతున్నామన్నారు. ఇప్పటికైనా ఆయా పార్టీలు వారు తూర్పు కాపులు ప్రాధాన్యత ను గుర్తించి ఎంపి స్థానాన్ని కేటాయించని పక్షంలో తూర్పు కాపుల ఆగ్రహానికి గురువ్వక తప్పదని హెచ్చరించారు. సమావేశంలో తూర్పు కాపు సామాజిక వేదిక నాయకులు పిన్నింటి చంద్రమౌళి, టి.వెంకటరమణ, చందక చిన్ని ప్రభాకర్ (చిన్ని), మంత్రి రమణమూర్తి, సంగంరెడ్డి సాయి, గంటి రెడ్డి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

కొప్పల వెలమలకు ప్రాధాన్యతివ్వాలి

బొబ్బిలి: విజయనగరం ఎంపి స్థానాన్ని కొప్పల వెలమకు చెందిన మరిశర్ల రామారావునాయుడుకు కేటాయించాలని కొప్పల వెలమ సంక్షేమ సంఘం అధ్యక్షులు బి.తిరుపతినాయుడు డిమాండ్ చేశారు. స్థానిక సూర్య రెసిడెన్సీలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో అత్యధిక శాతం ఉన్న కొప్పల వెలమలకు అన్ని రాజకీయ పార్టీలు అన్యాయం చేస్తున్నాయన్నారు. విజయనగరం ఎంపి స్థానాన్ని వెలమలకు కేటాయించి బిజెపి నియోజకవర్గ కన్వీనర్ మరిశర్ల రామారావునాయుడుకు ఇవ్వాలని బిజెపి అధిష్టానాన్ని కోరారు. రామారావు నాయుడుకు టికెట్ ఇస్తే గెలిపించుకుంటామని చెప్పారు. ఈ సమావేశంలో కొప్పల వెలమలు సంక్షేమ సంఘం నాయకులు మరిశర్ల కృష్ణ మూర్తినాయుడు, కె.కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

మాల్యాడలో లేగ దూడల ప్రదర్శన

నెల్లిమర్ల: మండలంలోని మాల్యాడ గ్రామంలో బుధవారం లేగ దూడల ప్రదర్శన నిర్వహించారు. పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో 36 మంది పాడి రైతులు 38 లేగ దూడలను ప్రదర్శనకు తీసుకుని రాగా వీటిలో 0-3, 4-6, 7-12 నెలల వయసున్న దూడలను విభజించి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా పశుగణాభివృద్ధి సంస్థ జిల్లా కార్యనిర్వహణాధికారి డాక్టర్ ఎన్. దామోదర రావు మాట్లాడుతూ పాడి రైతులను మరింత ప్రోత్సహించడానికి లేగ దూడల ప్రదర్శన నిర్వహిస్తు న్నామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్ద పప్పల బలరాం, పశు సంవర్ధక శాఖా ఎడి చక్రవర్తి, పశు వైద్యులు ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌లో అభివృద్ధి పనులకు శ్రీకారం

రామభద్రపురం: మండల కేంద్రంలోని కూరగాయల మార్కెట్‌లో వివిధ అభివృద్ధి పనులకు బుధవారం మేజర్ పంచాయతీ సర్పంచ్ రవ్వ ఈశ్వరరావు, ఉప సర్పంచ్ చింతల రామకృష్ణల చేతుల మీదుగా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఉప సర్పంచ్, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చింతల రామకృష్ణ మాట్లాడుతూ చిరకాలంగా అనేక సమస్యలతో కొనసాగుతున్న మార్కెట్లో వివిధ మౌలిక సదుపాయాల కల్పనకు తమ పాలకవర్గం తీర్మానంతో శ్రీకారం చుట్టామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి వసంతుల తిరుపతిరావు, వార్డు మెంబర్లు తూముల గోపాలకృష్ణ, మజ్జి రమేష్, కొయ్యాన గంగరాజు, గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

బొబ్బిలి: పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యాన్ని సొంతం చేసుకోవచ్చునని ఐసిడిఎస్ సిడిపిఒ జాగాన విజయలక్ష్మి అన్నారు. పట్టణంలోని 16,18 వార్డులలో బుధవారం పోషణ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలు, కౌమార దశలో ఉన్న బాలికలు, గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉండవచ్చున్నారు. అంగన్వాడీ సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

ఆస్తి హక్కు కల్పనే ప్రభుత్వ లక్ష్యం

రామభద్రపురం: భూవివాదాలు లేని ఆస్తి హక్కు కల్పనే తమ ప్రభుత్వ లక్ష్యమని స్థానిక ఎమ్మెల్యే చినప్పలనాయుడు అన్నారు. రొంపిల్లి గ్రామ సచివాలయ పరిధిలో బుధవారం ఆస్తి హక్కు పత్రాలు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్షణ పథకంలో భాగంగా మంజూరైన భూ శాశ్వత హక్కు ఆస్తి యజమాన్య ధ్రువపత్రాలను రైతులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సులోచనారాణి, ఎంపిపి చొక్కాపు లక్ష్మణరావు, జెడ్పిటిసి అప్పికొండ సరస్వతి, సర్పంచ్ భవిరెడ్డి పెంట మ్మ, ఎంపిటిసి శంకర్రావు, స్థానిక వైసిపి నాయకులు పువ్వల వెంకట రమణ, పువ్వల నారాయణ రావు, పువ్వల మురళీ మనోహర్, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

అంతర్జాలంలో సామాజిక తనిఖీపై శిక్షణ

రామభద్రపురం: స్థానిక మండల విద్యా వనరుల కేంద్రంలో బుధవారం ఎంఇఒ తిరుమల ప్రసాద్ ఆధ్వర్యంలో స్టేట్ రిసోర్స్ పర్సన్ కొల్లి ఈశ్వరరావు పాఠశాల సామాజిక తనిఖీ అంశంపై ప్రధానోపాధ్యాయులకు ఒకరోజు శిక్షణను అంతర్జాలం ద్వారా ఇచ్చారు. ఈ సందర్భంగా తిరుమల ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులతోపాటు పాఠశాల అభివృద్ధి చెందాలంటే సంబంధిత ప్రధానోపాధ్యాయులు భాధ్యతగా సమగ్ర పాఠశాల మూల్యాంకన విధానం, సామాజిక తనిఖీ, పర్యావరణం, సామాజిక వ్యవస్థ బలోపేతం వంటి వాటిపై విద్యార్థులను, తల్లిదండ్రులను సమన్వయం చేసుకోవాలని కోరారు. ఈ శిక్షణలో ఎంఇఒ2 ఆర్.పెంటయ్య, అన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇంటింటి కుళాయిలకు శంకుస్థాపన

భోగాపురం: మండలంలోని రెడ్డి కంచేరు గ్రామంలో ఇంటింటి కుళాయి పనులకు వైసిపి మండల అధ్యక్షులు ఉప్పాడ సూర్యనారాయణ రెడ్డి బుధవారం శంకుస్థాపన చేశారు. వాటర్ ఎయిడ్ సచ్ఛంద సంస్థ గ్రామంలోని 210 కుళాయిలు తమ సొంత సొమ్ముతో వేసేందుకు ముందుకు వచ్చింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బైరెడ్డి రమణారెడ్డి, మండల జెసిఎస్ కన్వీనర్ బైరెడ్డి యర్రప్పలనారాయణ, నాయకులు దల్లి బంగారు రెడ్డి, బైరెడ్డి రాజు, అప్పన్న, వాటర్ ఎయిడ్ సంస్థ జిల్లా కోఆర్డినేటర్ పి ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

టిడిపి హయాంలోనే మెరుగైన వైద్య సేవలు

జామి: టిడిపి ప్రభుత్వ హయాంలోనే పేదలకు మెరుగైన వైద్య సేవలందాయని మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. పేదలకు వైద్య సేవలు అందించడంలో ఎన్‌టిఆర్ సేవాసమితి, ఎంవిఎస్ మూర్తి ట్రస్టులు ముందుంటాయని ఆమె కొనియాడారు. మండల కేంద్రంలోని వెంకటేశ్వర కళ్యాణ మండపంలో బుధవారం ఎన్‌టిఆర్ సేవాసమితి ట్రస్టు, ఎంవిఎస్ మూర్తి ట్రస్టు సంయుక్తంగా నిర్వహించిన మెగా వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. అనంతరం వివిధ విభాగాల్లో వైద్యులు చూసిన రోగులకు నామమాత్రపు మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ హోదాల్లో ఉన్న టిడిపి నాయకులు, జనసేన నాయకులు యువత, మహిళలు పాల్గొన్నారు.

కిక్ బాక్సింగ్ కోచ్‌కు సత్కారం

నెల్లిమర్ల: నెల్లిమర్ల నగర పంచాయతీ పరిధిలోని జరజాపుపేటకు చెందిన కిక్ బాక్సింగ్ కోచ్ కాళ్ల మహేష్‌ను బుధవారం విశాఖ పట్నం పోర్టు స్టేడియంలో ఘనంగా సత్కరించారు. జాతీయ, అంతర్ జాతీయ కిక్ బాక్సింగ్ పోటీల్లో క్రీడాకారులకు నైపుణ్యంతో కూడిన శిక్షణ ఇచ్చినందుకు మార్షల్ ఆర్ట్స్ ప్రతినిధులు ఆయన్ను సత్కరించారు.

వేపాడలో నారీ శక్తి ఫిట్‌నెస్ రన్

వేపాడ: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా నెహ్రూ యువ కేంద్రం కోఆర్డినేటర్ వెంకట్ ఉజ్వల్ ఆదేశాల మేరకు నారీ శక్తి ఫిట్‌నెస్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్ఎస్ వల్లి, డి ప్రసాద్, మండల కోఆర్డినేటర్లు జగదీష్, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

కెజిబివిలో ప్రవేశాలకు దరఖాస్తులు

2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి వేపాడ కెజిబివి పాఠశాలలో ఇంటర్ సిఇసి గ్రూప్, ఆరో తరగతిలో చేరేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. ఏప్రిల్ 11వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకునే వెసులుబాటును కల్పించారు

పండగ పూట కాలువ కంపే..!

- మురికి కూపంగా జెఎ ఛానల్ • అనారోగ్యం బారిన జామి ప్రజలు • ఈ నెల 16 నుంచి ఎల్లారమ్మ జాతర • చోద్యం చూస్తున్న అధికారులు, పాలకపక్షం

ప్రజాశక్తి - జామి

- ఈ ఫొటోలో కనిపిస్తోంది మురుగు కాలువనుకుంటే తప్పులో కాలేసినట్లే.. ఇది జామి మండల కేంద్రం మధ్య గుండా ప్రవహించే సాగునీటి కాలువ. దీన్ని జాగారం - అన్నంరాజపేట కాలువుగా పిలుస్తారు. గొస్తనీ నదిపై నిర్మించిన ఈ కాలువ జాగారం ఆనకట్ట వద్ద ప్రారంభమై జామి మేజరు పంచాయతీ గుండా ప్రవహిస్తోంది. కానీ జామి మేజరు పంచాయతీ చెత్తతో సాగునీటి కాలువ కాస్త మురుగు కాలువగా మారిపోయింది. ఇదే జామి గ్రామంలో అపారిశుధ్యం తాండవించేలా చేస్తోంది. కాగా ఈ నెల 16 నుంచి మూడు రోజులు పాటు ఎల్లారమ్మ జాతర ఉన్న నేపథ్యంలో పండుగ పూట కూడా దుర్వాసనలు వెదజల్లుతున్న పరిస్థితి నెలకొందని మండల కేంద్ర ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాలకులు, అధికారులు చోద్యం చూస్తున్నారు తప్పా..నివారణ చర్యలు చేపట్టడం లేదు. ఫలితంగా గ్రామ ప్రజలు నిత్యం దుర్వాషనల మధ్య తిరుగుతున్న దుర్భర పరిస్థితులు ఉన్నాయని వాపోతున్నారు.

మండలంలో జాగారం - అన్నంరాజుపేట సాగు నీటి కాలువ 5 కిలోమీట్లర్లు మేర ప్రవహిస్తోంది. అందులో సగబాగం జామి మేజరు పంచాయతీలోనే ప్రవహిస్తోంది. వాస్తవానికి సాగునీటి కాలువలో ఎటువంటి వ్యర్థాలు, మలినాలూ కలవకూడదు. కానీ యథేచ్ఛగా పంచాయతీలోని వ్యర్థాలు కాలువలో కలిపేస్తున్నారు. ఫలితంగా జెఎ ఛానల్ మురుగు కూపంలా మారిపోయి, ప్రజారోగ్యాన్ని తీవ్రంగా దెబ్బతీస్తుందని జామి ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా పంచాయతీ, మండల స్థాయి అధికారులు



సాగునీటి కాలువలో పేరుకుపోయిన మురుగు, చెత్త

చోద్యం చూస్తున్నారే తప్ప నివారణ చర్యలు చేపట్టడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పోనీ పాలక వర్గమైనా పట్టించుకుంటుందా అంటే అదీ లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. జామి మేజరు పంచాయతీలో 12,732 మంది జనాభా నివసిస్తున్నారు. ఈ గ్రామం గుండా సుమారుగా మూడు కిలో మీటర్ల మేర జెఎ ఛానల్ కాలువ ప్రవహిస్తోంది. స్వచ్ఛమైన సాగునీటితో ప్రవహించే కాలువ సైతం నేడు కలుషితమైన మురుగు కాలువగా మారి నిత్యం దుర్వాసన వెదజల్లుతోంది. ఇది కూడా మండల పరిషత్తు కార్యాలయానికి ఆనుకుని ఉండటం, అక్కడకు రోజుకి సిబ్బందితో పాటు ఇతర ప్రజలు వందలాది మందిగా వస్తుండటం, వీరంతా ఈ దుర్వాసనతో ఇబ్బందులు పడటమే కాకుండా అనారోగ్యానికి గురవుతుండటం నిత్య కృత్యంగా మారింది.

చికెన్ దుకాణాల్లో మిగిలిన వ్యర్థాలూ కాలువలోనే

ఈ కాలువలో గ్రామానికి చెందిన చెత్తతో పాటు చికెన్ దుకాణాల్లో మిగిలిన వ్యర్థాలను, చనిపోయిన కోళ్లను సైతం పడేయడం వల్ల కాలువ మొత్తం కలుషితమై దుర్వాసన వస్తోంది. ఒక్క చికెన్ దుకాణాలు మాత్రమే కాదు...చేపలు, మటన్ షాపుల్లో మిగిలిన వ్యర్థాలు, కళ్యాణ మండపంలోనీ మిగులు వ్యర్థాలకు కాలువ భాగమే కేంద్ర బిందువు. ఈ నేపథ్యంలోనే గ్రామ ప్రజలు జ్వరాలు బారిన పడుతున్నారని ఆవేదన చెందుతున్నారు. ముఖ్యంగా నెయ్యిల వీధి, పడాల వీధి, మంగల వీధి, బిసి కాలనీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం దోమలు, విష కీటకాల బారిన పడి అనారోగ్యాలకు గురవుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే కాలువలో పేరుకుపోయిన మురుగు, చెత్తను తొలగించాలని కోరుతున్నారు.

కాలువలో వ్యర్థాలు వేయకూడదు

సాగునీటి కాలువలో వ్యర్థాలు వేయకూడదు. జాగారం- అన్నంరాజపేట కాలువ సగభాగం జామి మేజరు పంచాయతీ గుండా ప్రవహిస్తోంది. కాలువలో పంచాయతీ వ్యర్థాలు అధికంగా కనిపిస్తున్నాయి. దీనిపై ఇప్పటికే అనేక దఫాలు దుకాణాధారులను హెచ్చరించాం. పంచాయతీ దృష్టికి తీసుకెళ్లాం. మరోసారి చర్యలకు ఎంపిడిఒ, పంచాయతీ ఇఒ దృష్టికి తీసుకెళ్లి, కాలువ కలుషితం కాకుండా చర్యలు తీసుకుంటాం.

- మూర్తి, ఇరిగేషన్ జేయి, జామి మండలం

అభివృద్ధి పథంలో డి.కొల్లాం

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలోని ఢీకొల్లం పంచాయతీ అభివృద్ధి పథంలో దూసుకుపోతుంది. గ్రామ సర్పంచ్ అప్పడా శివకృష్ణ ఆధ్వర్యంలో పంచాయతీ పరిధిలో ఉన్న డి.కొల్లాం, కె.కొల్లం, ఆర్ ముంగినాపల్లి, రెడ్డిక పేట గ్రామాలు రోజు రోజుకూ అభివృద్ధి చెందుతున్నాయి. అన్ని గ్రామాల్లో సిసి కాలువలు, సిసి రోడ్లు, రచ్చబండలు ఇలా అన్ని అభివృద్ధి కార్యక్రమాలనూ చేపడుతు న్నారు. పంచాయతీ పరిధిలో ఆర్ ముంగి నాపల్లిలో రూ.2.50లక్షలతో సిసి రోడ్లు, సిసి కాలువలు వేశామని కె. కొల్లాంలో రూ.65 వేలతో సిసి రోడ్డు, కాలువ నిర్మించామని సర్పంచ్ శివకృష్ణ తెలిపారు. రెడ్డిక పేట ఊరు మొత్తం సిసి కాలువలను రూ.6 లక్షలతో నిర్మించామన్నారు. ఆర్.ముంగనా పల్లిలో రామకోవెల నుంచి ఊరి చివరి వరకు రూ.2లక్షలతో త్వరలో సిసి రోడ్డు వేస్తామన్నారు. పంచాయతీ మొత్తం రెండున్నర సంవత్సరాల కాలంలో సుమారు రూ.25లక్షలతో అభివృద్ధి పనులు చేశామని చెప్పారు. కె. కొల్లాం వెళ్ళడానికి సిసి రోడ్డుకు రెండు వైపులా సిసి గోడలు ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు సహకారంతో నిర్మించామన్నారు. పంచాయతీ అభివృద్ధికి మండల పరిషత్ నిధులు, పంచాయతీ నిధులను వినియోగించామని చెప్పారు. తమ పంచాయతీ అభివృద్ధికి ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడుకు, ఎంపిపి బంటుపల్లి వెంకట వాసు దేవరావుకు, అధికారులు సహకరించారని తెలిపారు.



పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ శివకృష్ణ

సిమెంట్ కంపెనీ ఏర్పాటుపై ప్రజాభిప్రాయ సేకరణ

ప్రజాశక్తి - కొత్తవలస

మండలంలోని అప్పన్నపాలెం పంచాయతీ, దత్తి గ్రామం వద్ద అల్ట్రాటెక్ సిమెంట్ లిమిటెడ్ కంపెనీ నిర్మాణానికి బుధవారం ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా రెవెన్యూ అధికారి ఎస్‌డి. అనిత ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని జిల్లా పరిశ్రమల అధికారి బి.బి. సరిత నిర్వహిం చారు. ఈ సందర్భంగా డిఆర్ఒ అనిత మాట్లాడుతూ ఈ ప్రాం తంలో అల్ట్రాటెక్ సిమెంట్ కంపెనీ నిర్మాణానికి అనుకూలమైన పరిస్థితు లను, ప్రతికూల పరిస్థితులపై ప్రజాభి ప్రాయ సేకరణ సేకరిస్తున్నామని తెలి పారు. ఈ ప్రజాభిప్రాయ సేకరణకు అప్పన్న పాలెం, దత్తి, దన్నినపేట, కొత్త సుంకర పాలెం, కంటకాపల్లి, కొత్తూరు, సాంబయ్యపాలెం, సింహాద్రిపాలెం, చిన్నిపాలెం, ఉత్తరాపల్లి గ్రామల ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై తమ అభిప్రాయాలను విన్నవించారు. సిమెంట్ పరిశ్రమ ఏర్పాటు తామందరికీ ఆమోదయోగ్య మేనని, కానీ కాలుష్యాన్ని తమ మీదకి వెదజల్లకుండా తగిన జాగ్రత్తలు కంపెనీ యాజమాన్యం తీసుకోవాలని విన్నవిం చారు. ఈ సందర్భంగా గ్రామల పెద్దలు డిఆర్ఒ అనిత దృష్టికి అనేక సమస్యలను తీసుకువచ్చారు. చదువుకున్న తమ ప్రాంత యువకులకు 75శాతం ఉద్యో గాలు కల్పిస్తామని యాజమాన్యం లిఖిత పూర్వకంగా హామీ ఇవ్వాలని కోరారు. గ్రామాలను అభివృద్ధి చేస్తామని, కర్మాగారం చుట్టూ పచ్చదనం పెంపొందేలా 30శాతం చెట్ల పెంపకం చేపడతామని యాజమాన్యం చెప్పడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కంటకాపల్లి, దత్తి, దన్నినపేట, కొత్తూరు, సాంబయ్యపాలెం, కొత్త సుంకరపాలెం, చిన్నిపాలెం ప్రజలు తమ అభిప్రాయాలను వెలబుచ్చారు. తహశీల్దార్ చంద్రశేఖర్, ఆర్ఐ, వీఆర్వోలు, గ్రామపంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గ్రామస్తుడు

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మిమ్స్ ఉద్యోగులు, కార్మికుల సమస్యలను యాజమాన్యం పరిష్కరించాలని మిమ్స్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు టివి రమణ డిమాండ్ చేశారు. స్థానిక ఆర్ఒబి వద్ద మిమ్స్ ఉద్యోగులు, కార్మికులు న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చేస్తున్న నిరశన శిబిరం బుధవారం నాటికి 42వ రోజుకి చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి నెల జీతాలు, డిఎ బకాయిల, వేతన ఒప్పందం చేయాలని నిరశన సమ్మె చేస్తుంటే యాజ మాన్యం పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేయడం భావ్యం కాదన్నారు. మిమ్స్ అభివృద్ధిలో ఉద్యోగులు, కార్మికుల భాగస్వా మ్యం ఉందని యాజమాన్యం గుర్తుంచుకోవాలని హితవు పలికారు. ఎమ్మెల్యే సమక్షంలో యాజమాన్యం, ఉద్యోగులు, కార్మికులతో చర్చలు జరిగాయని రెండు మూడు రోజుల్లోగా సమస్యలు సానుకూలంగా పరిష్కారం జరుగుతుందని ఎమ్మెల్యే చెప్పినట్లు టివి రమణ తెలిపారు. ఉద్యోగులు, కార్మికులకు 45శాతం ఇంక్రిమెంట్ ఇవ్వాలని, బకాయి డిఎలు పూర్తి స్థాయిలో చెల్లించి, వేతన ఒప్పందం చేసి, సమ్మె కాలానికి జీతాలు చెల్లించి, యాజమాన్యం వేధింపులు, కక్ష సాధింపులు లేకుండా బేషరత్తుగా విధుల్లోకి తీసుకోవాలని ప్రతిపాదన చేసినట్లు తెలిపారు. ఈ శిబిరంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, ఉద్యోగులు ఎం.నారాయణ, గౌరి, మూర్తి, అప్పలనాయుడు, వరలక్ష్మి, బంగారు నాయుడు, ఎం.రాంబాబు, ఎం. నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు టివి రమణ

ఎన్నికల యుద్ధానికి సిద్ధం కావాలి

ప్రజాశక్తి- గరివిడి

వాలంటీర్లు, బూత్ కన్వీనర్లు, కమిటీ సభ్యులు ఎన్నికల యుద్ధానికి సిద్ధం కావాలని జిల్లా పరిషత్తు చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. స్థానిక వైసిపి కార్యాలయంలో బుధవారం గుర్ల మండల వాలంటీర్లు, బూత్ కన్వీనర్లు, కమిటీ సభ్యులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాజకీయాలకి పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు వాలంటీర్ వ్యవస్థ ద్వారానే అందించామన్నారు. సంక్షేమ పథకాలను వివరించి ప్రతి ఓటును ఒడిసి పట్టుకునే బాధ్యత బూత్ కమిటీ, వాలంటీర్లు పై ఉందని అన్నారు. 2024 ఎన్నికల కురుక్షేత్ర యుద్ధానికి అందరూ సిద్ధంగా ఉండాలని రానున్న 40 రోజులు బూత్ కన్వీనర్ ఆధ్వర్యంలో బూత్ కమిటీ సభ్యులు, వాలంటీర్లు సమన్వయంగా పనిచేసి సీఎం జగన్ గెలుపునకు శక్తివంచన లేకుండా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో వైసిపి నాయకులు డాక్టర్ బొత్స సందీప్, రాజాం నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పరిశీలకులు పులిరాజు, పొట్నూరు సన్యాసినాయుడు, జెడ్పిటిసి శీర అప్పలనాయుడు, వైసిపి మండల అధ్యక్షులు జమ్ము స్వామి నాయుడు, జిల్లా పశుసంవర్ధక చైర్మన్ బెల్లాన బంగారునాయుడు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెడ్పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

క్రాష్ ప్రోగ్రాం ప్రారంభం

ప్రజాశక్తి- గంట్యాడ

స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో బుధవారం క్రాష్ ప్రోగ్రామ్ వాహనాన్ని ఎంపిపి పీరుబండి హైమావతి, జెడ్పిటిసి వరి నరసింహమూర్తి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ప్రతి గ్రామంలోని బోరులను పరిశీలించి తాగునీటి సమస్యను పరిష్కరించాలన్నారు. అవసరమైన దగ్గర కొత్తగా బోర్లు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్‌సి సెల్ చైర్మన్ పీరుబండి జైహింద్, ఎంపిడిఒ భవాని, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ సంతోష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

భోగాపురం: వేసవిలో తాగు నీటికి ఇబ్బంది లేకుండా ఉండేందుకు క్రాష్ ప్రోగ్రామ్‌ను ప్రారంభిస్తున్నామని ఎంపిపి ఉప్పాడ అనూష రెడ్డి అన్నారు. బుధవారం క్రాష్‌ప్రోగ్రామ్ వాహనాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేసవిని దృష్టిలో ఉంచుకొని ఈ కార్యక్రమం ద్వారా గ్రామాల్లో ఉన్న బోర్లను మరమ్మతులు చేస్తారన్నారు. ఇందుకోసం మండల పరిషత్ నిధి నుండి రూ.5 లక్షలు మంజూరు చేశామన్నారు. 22 పంచాయతీల్లో పర్యటించి పాడైన బోర్లకు మరమ్మత్తులు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ చంద్రకళ, వైసిపి మండల అధ్యక్షులు ఉప్పాడ సూర్యనారాయణ రెడ్డి, పరిపాలన అధికారి బంగారయ్య, బోర్ మెకానిక్‌లు పాల్గొన్నారు

15న విశాఖలో కాంగ్రెస్ బహిరంగ సభకు

ప్రజాశక్తి - పూసపాటిరేగ

ఈ నెల 15వ తేదిన విశాఖపట్నంలో జరగనున్న కాంగ్రెస్ భారీ బహిరంగ సభకు నాయకులు, కార్యకర్తలు హాజరవ్వాలని ఆ పార్టీ నాయకులు గంటా అప్పలనాయుడు కోరారు. ఈ సభలో ప్రత్యేక హోదా, విశాఖ ఉక్కు పరిశ్రమ పరిరక్షణ కోసం ప్రత్యేక డిక్లరేషన్ ఇస్తారని చెప్పారు. ఈ సభకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్, ఎపి పిసిసి అధ్యక్షులు వైయస్ షర్మిలారెడ్డి హాజరవుతారని ఈ సభను విజయంతం చేయాలని కోరారు.

పేదలకు న్యాయం చేయాలి

జామి: మండలంలోని యాతపాలేం గ్రామస్తులు దశాబ్దాల కాలంగా పక్కా ఇల్లుకు నోచుకోలేదని, తక్షణమే వారికి ఇంటి స్థలం ఏర్పాటు చేసి, ప్రభుత్వం ఇళ్ల అందించాలని సిఐటియు నాయకులు మద్దిల రమణ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం స్థానిక తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేసి, కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. ఈ సందర్భంగా మద్దెల రమణ, గాడి అప్పారావు మాట్లాడుతూ ప్రభుత్వాలు మారుతున్నా యాతపాలెం గ్రామస్థులకు సొంతింటి కల నెరవేరలేదన్నారు. ఇంటి స్థలాలకు ఎల్‌పిజిలు ఇవ్వకపోవడం రెవెన్యూ అధికారుల ఉదాసీనతకు నిదర్శనమని ఆరోపించారు. ఇప్పటికైనా ఇంటి స్థలం, ప్రభుత్వ గృహ నిర్మాణ పథకం మంజూరు చేసే, చర్యలు తీసుకొని యెడల సిఐటియు వారి పక్షాన పోరాటం చేస్తుందని హెచ్చరించారు. యాతపాలెం పేదలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పాఠశాల సందర్శన

డెంకాడ: మండలంలోని పెద్దతాడివాడ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలను ఆర్‌బిఐ ఎల్‌డిఒ నాగ ప్రవీణ్, ఎస్‌బిఐ ఎల్‌డిఎం శ్రీనివాసరావు బుధవారం సందర్శించారు. 8,9 తరగతుల విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ చిన్నతనం నుండే పొదుపు చేయడం యొక్క ఆవశ్యకతను వివరించారు. భవిష్యత్తులో చదువుకు, వివాహాలకు, కుటుంబ సభ్యుల అనారోగ్యాలకు అవసరమైన డబ్బును చిన్నతనం నుండే పొదుపు రూపంలో దాచుకోవడం ద్వారా భవిష్యత్తు అవసరాలను తీర్చుకోవచ్చని నాగ ప్రవీణ్ తెలిపారు. నేటి పొదుపే రేపటి మదుపుగా విద్యార్థులు గుర్తించాలన్నారు. అనంతరం విద్యార్థులకు 70 స్టీల్ ప్లేట్లు, మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు ఎస్.రవిశంకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వ్యవసాయానికి ఉపాధి అనుసంధానం చేయాలి

బొండపల్లి: వ్యవసాయానికి ఉపాధి హామీ పథకాన్ని అనుసంధానం చేయాలని వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు తాళ్లపూడి కృష్ణ కోరారు. బుదవారం మండలంలోని నెలివాడ రైతు భరోసా కేంద్రంలో వ్యవసాధికారి మల్లికార్జునరావు ఆధ్వర్యంలో మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా తాళ్లపూడి కృష్ణ మాట్లాడుతూ వ్యవసాయంలో పెరుగుతున్న ధరల దృష్ట్యా రైతులు పెట్టుబడి పెట్టలేకపోతున్నారని ఈ నేపథ్యంలో పంట సాగు చేయలేక భూములను ఖాళీగా వదిలేస్తున్నారని అన్నారు. రైతులకు రాయితీ పై వ్యవసాయా యంత్రాలు సరఫరా చేయాలనీ కోరారు. ఈ సమావేశంలో సహాయ వ్యవసాయ సంచాలకులు మహారాజన్, మండల ఉద్యానవనాధికారి రాజశేఖర్ మండలి సభ్యులు కోరాడ సత్యనారాయణ, సుంకరి శ్రీనివాసరావు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలను ఎంఇఒ పరిశీలన

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని అరిగి పాలెం ప్రాథమిక పాఠశాలను మండల విద్యాశాఖాధికారి పి.బాలభాస్కరరావు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాలకు సంబంధించిన రికార్డులను, విద్యార్థులు వర్క్ బుక్స్, డైరీ, మధ్యాహ్న భోజన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి విద్యార్థి యూనిఫారం ధరించే విధంగా అలవాటు చేయాలన్నారు. పాఠశాల ఆవరణంతా పరిశుభ్రంగా పచ్చదనంగా ఉండాలని అందుకు తగిన చర్యలు తీసుకోవాలని పాఠశాల సిబ్బందికి సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి మెనూ ప్రకారం పిల్లలకు భోజనాలు వండి పెట్టాలని సూచించారు. అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గో రక్షణకు ముందుకు రావాలి

గంట్యాడ : గోవులు మన జాతి సంపద వాటి రక్షణకు సంక్షేమానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తహశీల్దార్ పి.నీలకంటేశ్వర్ రెడ్డి అన్నారు. తహశీల్దార్ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ గో సంరక్షణ సమైక్య రూపొందించిన గోమాత చిత్రపటంతో కూడిన కేలండర్‌ను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జంతు సంరక్షణ గోవుల సంక్షేమ కోసం అందరూ కలిసికట్టుగా పనిచేయాలన్నారు. అక్రమ పశురవాణా, కోడి, గొర్రె పందాలు నిర్వహించిన వారిపై నిఘా పెడతామన్నారు. ఆంధ్రప్రదేశ్ గో సంరక్షణ సమైక్య రాష్ట్ర అధ్యక్షులు లోగిసి రామకృష్ణ మాట్లాడుతూ గోమాత విశిష్టతను ప్రజలకు వివరించడానికి ఈ కేలండర్‌ను ఇంటింటికీ పంపిణీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గో సంరక్షణ సమైక్య రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కెవిఆర్ సత్యనారాయణ, డోర కేశవరావు, గుడియాడ త్రినాధరావు, బొసర్ల అప్పలరాజు, చందక ప్రసాద్, గంట్రెడ్డి అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

గ్లకోమాను నిర్లక్ష్యం చేయొద్దు

రేగిడి: గ్లోకోమా కంటి వ్యాధిని నిర్లక్ష్యం చేయవద్దని వైద్యాధికారి డాక్టర్ చలమయ్య, ఆఫ్తాల్మిక్ ఎస్ వసంతరావు అన్నారు. ఈ మేరకు బుధవారం బూరాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ గ్లకోమా ఉత్సవాలు జిల్లా అంథత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 35 సంవత్సరాలు పైబడిన ప్రతి ఒక్కరూ రెండు సంవత్సరాలకు ఒకసారి నేత్ర పరీక్షలు చేసుకోవడం ద్వారా గ్లకోమా వ్యాధి ద్వారా సంభవించే అందత్వం నుండి దృష్టిని కాపాడుకోవచ్చని అన్నారు. అనంతరం ఆఫ్తాల్మిక్ అధికారి వసంతరావు 35 మందికి నేత్ర పరీక్షలు నిర్వహించి, వారిలో అవసరమైన వారికి కంటి శస్త్ర చికిత్సలు కోసం పుష్పగిరి కంటి ఆసుపత్రికి పంపించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో పిహెచ్ఎన్ఎస్ సావిత్రి, పర్యవేక్షకులు డి.సాయికృష్ణ, జగన్ మోహనరావు, పుష్పగిరి కంటి ఆసుపత్రి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌బికెను ప్రారంభించిన ఎమ్మెల్యే

రామభద్రపురం: మండలంలోని రావివలస గ్రామంలో రూ.23.94 లక్షలతో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ఎమ్మెల్యే శంబంగి వెంకటచినప్పలనాయుడు బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి చొక్కాపు లక్ష్మణరావు, జెడ్పిటిసి అప్పికొండ సరస్వతి, గ్రామ సర్పంచ్ సోములు కుమారి పాల్గొన్నారు.

సిఎం రిలీఫ్ ఫండ్ అందజేత

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మండంలోని మొయిద గ్రామంలో ఎమ్మెల్సీ సురేష్‌బాబు బుధవారం బాధిత కుటుంబాలకు సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందించారు. కొండవెలగాడకు చెందిన కెల్ల శివ, సంధ్య దంపతుల కుమార్తె బంధావి పుట్టుకతోనే పచ్చ కామెర్ల వ్యాధితో బాధపడుతుండటంతో జడ్‌పిటిసి ఆధ్వర్యంలో సిఎం రిలీఫ్ ఫండ్ కు ఎమ్మెల్సీ సిఫార్స్ చేశారు. ఈ మేరకు రూ.42వేలు మంజూరు కావడంతో ఆ చెక్కును పాప తల్లిదండ్రులకు అందించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి గదల సన్యాసినాయుడు, వైస్ ఎంపిపి పతివాడ సత్యనారాయణ, మొయిద, సతివాడ సర్పంచులు అట్టాడ కృష్ణ, రేవల్ల శ్రీను, వల్లూరు వైసిపి నాయకులు పంచాది శ్రీరాములు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కళ్లద్దాలు పంపిణీ

విజన్ స్ప్రింగ్ ఆధ్వర్యంలో ఇటీవల కంటి పరీక్షలు చేయించుకున్న వారికి బుధవారం ఎమ్మెల్సీ చేతులు మీదుగా కళ్లద్దాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అట్టాడ కృష్ణ, నాయకులు ఎడ్ల కృష్ణ, ధవళ లక్ష్మణరావు, మొయిద లక్ష్మణ రావు తదితరులు పాల్గొన్నారు.